www.teachersbadi.in

# బాలల భవిత కోసం

# ఉచిత, నిర్బంధ విద్య బాలల హక్కు చట్టం, 2009

6 - 14 సంవత్సరాల పిల్లలందరు బడిలో చేరి ఉచితంగా చదువుకోడానికి ఉద్దేశించిన చట్టం **"ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కు చట్టం - 2009" 2009 ఆగష్టు 27వ తేదీన పార్లమెంటు ఆమోదించింది.** దీనినే "Right to Education, Act 2009" (RTE, 2009) అని కూడా అంటారు.

## RTE 2009 చట్టంలోని ముఖ్యాంశాలు

- 6 - 14 సంవత్సరాల పిల్లలందరు పరిసరప్రాంత పాఠశాలల్లో ఎలిమెంటరీ విద్య (1- 8 తరగతులు) పూర్తి చేసే వరకు **ఉచిత, నిర్బంధ విద్య పొందే హక్కు కలిగి ఉంటారు.**
- పాఠశాలల ఏర్పాటు, పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనాపరికరాలతో సహా మౌళిక సదుపాయాలను కల్పించడానికి సంబంధిత ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.
- ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక బడిలో చేరి, హాజరవుతూ, ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసేలా చూసే బాధ్యత ప్రభుత్వం పై ఉంటుంది.
- ఈ చట్టం ప్రకారం తమ బిడ్డ లేదా సంరక్షణలో ఉన్న బాలుడు / బాలికను పరిసర ప్రాంతంలోని పాఠశాలల్లో **చేర్పించడం ప్రతి తల్లిదండ్రి లేదా సంరక్షకులపై బాధ్యత ఉంటుంది.**
- మూడు సంవత్సరాలు మించిన బాలలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేయడానికి, **ఉచిత పూర్వ పాఠశాల విద్యను అందించడానికి** అవసరమైన ఏర్పాట్లును సంబంధిత ప్రభుత్వం చేపడుతుంది.
- ఎయిడెడ్ పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు తమ బడిలో చేర్చుకున్న పిల్లల్లో **కనీసం 25 శాతానికి తగ్గకుండా ఒకటవ తరగతిలో పేద పిల్లలను చేర్చుకోవాలి. ఎలిమెంటరీ వరకు ఉచితంగా విద్యనందించాలి. ఇందుకయ్యే ఖర్చును అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది.**
- బడిలో పిల్లల ప్రవేశానికి **ఎంపిక విధానం, క్యాపిటేషన్ రుసుం ఉండదు.** ఒకవేళ క్యాపిటేషన్ రుసుం వసూలు చేస్తే దానికి 10 రెట్ల వరకు జరిమానాతో శిక్షిస్తారు.
- జనన ధృవీకరణ పత్రం ఆధారంగా పిల్లల వయస్సును నిర్ధారిస్తారు. అయితే **వయస్సు నిర్ధారణ చేయలేదన్న కారణంగా ఏ బాలుడు / బాలికకు బడిలో ప్రవేశాన్ని తిరస్కరించకూడదు.**
- బడిలో ప్రవేశం పొందిన **పిల్లలను అదే తరగతిలో మళ్లీ కొనసాగించడం** లేదా **బడి నుండి తీసివేయడం నిషేధం.**
- **బాలలను శారీరకంగా శిక్షించడం, మానసికంగా వేధించడం నిషేదం.** ఎవరైనా ఈ విధంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటారు.
- సంబంధిత అధీకృత సంస్థ నుండి గుర్తింపు ధృవీకరణ పత్రం లేకుండా బడిని ప్రారంభించరాదు. ఈ చట్టం ప్రకారం నియమాలు, ప్రామాణికాలు పూర్తి చేసే వరకు బడికి సంబంధిత అధీకృత సంస్థ గుర్తింపు ధృవీకరణ పత్రం జారీ చేయరాదు. ఒకవేళ ఇప్పటికే నడుస్తున్న పాఠశాలల్లో ప్రమాణాలు సరిగా లేకుంటే చట్టం అమలులోకి వచ్చిన 3 సం॥లలోపు సొంత ఖర్చులతో ఏర్పాటు చేయాలి. **ఇలా సరైన ప్రామాణికాలు, నియమాల ప్రకారం లేకుంటే ఆబడికి గుర్తింపును రద్దు చేయాలి.**
- గుర్తింపు **రద్దు ఐన తర్వాత కూడా ఏ వ్యక్తి ఐనా బడిని నడిపితే లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు.** ఒకవేళ ఉల్లంఘన ఇంకా కొనసాగితే తర్వాత రోజులకు రోజుకు 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తారు.

www.teachersbadi.in

www.teachersbadi.in

- ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు మినహాయించి అన్ని బడులలో స్థానిక ప్రభుత్వానికి ఎంపికైన ప్రజాప్రతినిధులతో, ఆ బడిలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు, ఉపాధ్యాయులతో **బడియాజమాన్య సంఘాన్ని ఏర్పాటు చేయాలి.**
- పాఠశాల **యాజమాన్య కమిటీ పాఠశాలల పనితీరును సమీక్షించడం, బడి అభివృద్ధి ప్రణాళికను తయారు చేసి సిఫారసు చేయటం, నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం** వంటి విధులను నిర్వహిస్తుంది.
- నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న వారినే ఉపాధ్యాయులుగా నియమిస్తారు.
- **ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం, సకాలంలో పాఠ్యాంశాలు బోధించడం, పిల్లల సామర్థ్యాన్ని అంచనావేసి అవసరమైతే అదనపు బోధన నిర్వహించడం, తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, పిల్లల ప్రగతి గురించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం వంటి విధులను నిర్వహించాలి. ఏ ఉపాధ్యాయుడు కూడా ప్రైవేటు ట్యూషన్లు, ప్రైవేటు బోధనా పనులను చేపట్టరాదు.**
- జనాభా గణన, వైపరీత్య సహాయ విధులు, ఎన్నికలకు సంబంధించిన విధులను మినహాయించి **టీచర్లను ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదు.**
- **బాలల సర్వతోముఖాభివృద్ధి జరిగేలా, బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందేలా, శారీరక, మానసిక శక్తులు అభివృద్ధి చెందేలా పాఠ్యప్రణాళిక,** పాఠ్యపుస్తకాలు, మూల్యాంకనం ఉండాలి. ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకు బాలలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరు కావాల్సిన అవసరం లేదు.
- ఈ చట్టం ప్రకారం 1 నుండి 5 తరగతులు బోధించడానికి 60 మంది పిల్లల వరకు ఇద్దరు, 61 నుండి 90 వరకు ముగ్గురు, 91 నుండి 120 వరకు నలుగురు, 121 నుండి 200 వరకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలి. 150 కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుడు కూడా ఉండాలి. 200 మంది కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడితో పాటు 1ః 40 మించకుండా ఉపాధ్యాయులను నియమించాలి.
- 6 నుండి 8వ తరగతి వరకు బోధించడానికి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడితో పాటు అదనంగా సైన్సు, లెక్కలకు ఒక ఉపాధ్యాయుడు, సామాజిక / సాంఘిక శాస్త్రానికి ఒక ఉపాధ్యాయుడు, భాషలు బోధించడానికి ఒక్కొక్క భాషకు ఒక ఉపాధ్యాయుడు కూడా ఉండాలి.
- 6 నుండి 8వ తరగతిలో చేర్చుకున్న పిల్లల సంఖ్య వందకు మించి ఉంటే పూర్తి కాల ప్రధానోపాధ్యాయులు మరియు చిత్రకళ, ఆరోగ్య వ్యాయామ విద్య, వృత్తి విద్యలు బోధించడానికి తాత్కాలిక బోధకులను నియమించాలి.
- అన్ని పాఠశాలల్లో ప్రతి టీచరుకు ఒక తరగతి గది, ప్రధానోపాధ్యాయుల గది, వంటగది, మంచినీటి సౌకర్యం, ఆడపిల్లలు, మగపిల్లలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆటస్థలం, ప్రహారీగోడ లేదా కంచె, గ్రంథాలయం వంటి సౌకర్యాలు, బోధనా పరికరాలు, క్రీడా సామాగ్రి ఉండాలి.

**చదువుకోవడం పిల్లల హక్కు. పిల్లలందరు చదువుకోడానికి బడిలో చేర్చే బాధ్యత మనందరిది.** పిల్లలు చదువుకునే హక్కును కోల్పోతే చట్టం ప్రకారం న్యాయాన్ని కోరవచ్చు. అట్లే పాఠశాలలన్నీ సరైన వసతి సౌకర్యాలు, భౌతిక వసతులు, బోధనా సిబ్బంది ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. బాలల భవితలో వెలుగులు నింపడానికి ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని ఆశిద్దాం! www.teachersbadi.in